క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ. 2.60 లక్షల విరాళం



మోపిదేవి: వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి నిత్యాన్నదానానికి తోట్లవల్లూరు మండలం వల్లూరిపాలెంకు చెందిన భక్తులు బండి సాయి గణేష్‌కృష్ణ, తేజస్విని దంపతులు రూ. 2.60 లక్షలు విరాళంగా అందజేశారు. గురువారం ఉదయం స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. దాతలకు స్వామివారి లడ్డు ప్రసాదంతో పాటు ఉత్తరిణీ అందజేశారు. ఆలయ ఏసీ ఎన్‌ఎస్ చక్రధరరావు, ఆలయ అధికారి రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

మండవల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము) అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.మల్లీశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే డీఎన్నార్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



గుడివాడటౌన్: పట్టణంలోని కే- కన్వెన్షన్‌లో గురువారం జరిగిన బీజేపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు కుమారుడి వివాహానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ హాజరయ్యారు. వధూవరులు ప్రతాప్‌వంశీ, వెంకట అఖిలకృష్ణ దంపతులను దేవానంద్ దంపతులు ఆశీర్వదించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘంటసాల వర్ధంతి రేపు

పామర్రు: స్థానిక చల్లపల్లి రోడ్డులోని హితమ్ స్కూల్ నందు ఈనెల 11వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు పద్మశ్రీ ఘంటసాల వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పద్మశ్రీ ఘంటసాల అండ్ ఎస్పీ బాలు స్మారక సంగీత కళాపీఠం అధ్యక్ష ఉపాధ్యక్షులు కాటూరి వెంకట మురళీకృష్ణ, కోటి పాండురంగారావు గురువారం తెలిపారు. ఘంటసాల పాటల సంగీత విభావరి, హితమ్ పాఠశాల విద్యార్థులచే నాట్య ప్రదర్శన, ఐదుగురు సీనియర్ సిటిజన్స్‌కు సన్మానం చేస్తామని తెలిపారు.

ఘనంగా లక్ష్మీ గణపతి హోమం




గుడివాడటౌన్: శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీ లక్ష్మీ గణపతి హోమం గురువారం భక్తిశ్రద్ధతో నిర్వహించారు. 72 మంది దంపతులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారి కరుణా కటాక్షాలు పట్టణ ప్రజలపై ఉండాలని కోరుతూ ఈ హోమం నిర్వహించామని ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్ తెలిపారు.

10కే రన్ విజయవంతం చేయండి

గుడివాడటౌన్: ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నిర్వహిస్తున్న పర్వతనేని జగన్మోహనరావు మెమోరియల్ జిల్లా స్థాయి 10కే రన్ జయప్రదం చేయాలని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి శివసుబ్రహ్మణ్యం(చంటి), సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్ కోరారు. స్టేడియం కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ పురుషుల విభాగంలో 10 కిలోమీటర్లకు, మహిళలకు 6కే, 4కే రన్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 12వ తేదీ వచ్చిన వారికి ప్రవేశం ఉండదని తెలిపారు.

ఎంపీపీ ఆకస్మిక తనిఖీ



బార్లపూడి(మొవ్వ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలని మొవ్వ మండల ఎంపీపీ కొండేటి ఇందిర సూచించారు. బార్లపూడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను గ్రామ సర్పంచ్ కేఎల్‌వి ప్రసాద్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జగనన్న గోరుముద్ద పథకం ద్వారా చిన్నారులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, నాయకులు కొండేటి చందు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ పాలన దేశానికే ఆదర్శం

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు(పమిడిముక్కల): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాల వారు ఆదర్శంగా తీసుకుని అనుసరిస్తున్నారని వైఎస్ జగన్ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ అన్నారు. పమిడిముక్కల మండలం అలినఖీపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ప్రతి గృహానికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బ్రోచర్లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుల, మత, ప్రాంత, పార్టీ అని బేధాలు లేకుండా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తోందని చెప్పారు.

నవరత్నాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి

సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన నవరత్న పథకాలతో ప్రతి ఇంటికీ ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూరిందని ఎమ్మెల్య కై లే చెప్పారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, చేతి వృత్తిదారులు, చిరు వ్యాపారులు తదితర అన్ని వర్గాల వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు పథకం ద్వారా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. రెండో విడతగా మరికొన్ని పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి చేస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా స్థానికులు వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయమై ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యేనుగ వెంకట రమణకుమారి, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, కో ఆప్షన్ సభ్యుడు మీర్జా దియనత్ ఆలీ, మండల కన్వీనర్ యలమంచిలి గణేష్, మండల ప్రధాన కార్యదర్శి మారపాక మహేశ్వరరావు, రెడ్డిక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కంభపు రాంబాబు, స్థానిక ఎంపీటీసీ మీర్జా సజ్జద్ ఆలీ, అధికారులు వైఎస్సార్ సీపీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు, అబ్దుల్ అజీజ్, కుమేల్, పాతూరి చంద్రపాల్, కొడాలి రాంబాబు, కొణతం శివరామకృష్ణ పాల్గొన్నారు.

పేదల కాలనీల్లో విద్యుత్ కాంతులు



భుజబలపట్నంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కాలనీలకు విద్యుత్ సౌకర్యాలు కల్పిస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. భుజబలపట్నం కాలనీలో ఇటీవల 63 నూతన విద్యుత్ స్తంభాలతో పాటు 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయగా, గురువారం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే డీఎన్నార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జగనన్న కాలనీలు, ఆక్వా రైతుల అవసరాల నిమిత్తం ఎక్కువగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయించామన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో పలు విద్యుత్ సబ్‌స్టేషన్లు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గురజాల రామతులసి, ఎంపీటీసీ సభ్యుడు పెన్మత్స సూర్యనారాయణరాజు, నాయకులు ముదునూరి రవిరాజు, గురజాల వేణు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం



పెదపూడి(మొవ్వ): మూడు రోజుల పాటు జరుగనున్న పెదపూడి శ్రీ సీతారామ స్వామి దేవాలయంలో శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి వార్ల, గణపతి సహిత చంద్రమ్మ అమ్మవారి, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజైన గురువారం మండప దేవతా పూజలు, మూల మంత్ర హవనము, పంచామృత, పంచగవ్యధివాస సహితంగా 33 ద్రవ్యాలతో అభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే సాయంత్రం గ్రామోత్సవాన్ని, విశేష పూజలు జరిపారు. శుక్రవారం ఉదయం యంత్ర స్థాపన, శాంతి కల్యాణోత్సవాలు నిర్వహిస్తామని, ఉదయం 11 గంటల నుంచి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని భారీగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మొవ్వ ఏపీఎం సస్పెన్షన్

మొవ్వ: అసభ్యకర ప్రవర్తన, లైంగిక వేధింపులు, నగదు అక్రమ వసూలు అభియోగాలపై విచారణ నిర్వహించిన అధికారులు మొవ్వ ఏపీఎం కాకుమాను సుబ్బారావుపై సస్పెన్షన్ విధిస్తూ కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాషా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన స్థానంలో పామర్రు మండల ఏపీఎం సీహెచ్ తిరుపతయ్య (పూర్తి అదనపు బాధ్యతలను) నియమిస్తూ ఆదేశాలు మొవ్వ కార్యాలయానికి అందాయి.

బైక్‌లు ఢీ కొని ఇద్దరికి గాయాలు

తోట్లవల్లూరు: కృష్ణా కరకట్టపై జరిగిన బైక్ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని వల్లూరుపాలెం వద్ద జరిగింది. కరకట్టపై అవనిగడ్డ వైపు నుంచి విజయవాడ బైక్‌పై వెళ్తున్న గోవాడ సుబ్బారావు, వల్లూరుపాలెం నుంచి టీవీఎస్ మోపెడ్‌పై తోట్లవల్లూరు వస్తున్న యార్లగడ్డ శివరామకృష్ణ గురువారం సాయంత్రం వల్లూరుపాలెం ఎస్సీ శ్మశానవాటిక సమీపంలో పరస్పరం ఢీకొట్టుకున్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. గాయపడిన వారిని 108 సిబ్బంది చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు.

కారు బోల్తా పడి వ్యక్తికి స్వల్పగాయాలు

తోట్లవల్లూరు: కరకట్టపై నుంచి కారు బోల్తా కొట్టిన ప్రమాదంలో వ్యక్తికి స్వల్పగాయాలైన ఘటన మండలంలోని వల్లూరుపాలెంలో జరిగింది. పెనమకూరు గ్రామానికి చెందిన పెద్ది వెంకటేశ్వరరావు కారులో గురువారం సాయంత్రం కృష్ణా కరకట్టపై విజయవాడ వెళ్తున్నారు. మార్గ మధ్యంలో వల్లూరుపాలెం సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి కృష్ణానది వైపు బోల్తా కొట్టింది. సకాలంలో స్థానికులు స్పందించి కారులో ఉన్న వెంకటేశ్వరరావును బయటకు తీశారు. ఆయన స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ పుష్పరాణి

గుడివాడటౌన్: నవరత్నాల అమలులో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రూరల్ మండల ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. స్థానిక మల్లాయిపాలెం లే-అవుట్‌లో నిర్మిస్తున్న జగనన్న కాలనీ మౌలిక వసతుల ఏర్పాటులో భాగంగా గురువారం సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆధ్వర్యంలో 9,300మంది నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టారన్నారు. ఇందులో భాగంగా రూ 3 కోట్లతో కాలనీలో సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నామని సుమారు 240 హైబడి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఎలక్ట్రికల్ డీఈ రామకృష్ణ, ఏడీఈ వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ గోళ్ల రామకృష్ణ, మాజీ సర్పంచ్ గద్దె రాము, వైఎస్సార్ సీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఎంజే విక్టర్, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

పెదపారుపూడి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనుల వేగవంతం చేయాలని తహసీల్దార్ వి.నాగభూషణం, ఎంపీడీఓ టీ.సీతామహాలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం హౌసింగ్ ఇళ్ల నిర్మాణ పనుల వేగవంతంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీలు, హౌసింగ్ ఏఈ మల్లిఖార్జునరావు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

గుడివాడటౌన్: ప్రభుత్వం అన్ని విధాల రాయితీలతో కూడిన రుణాలు మంజూరు చేస్తున్న నేపథ్యంలో ఇళ్ల నిర్మాణపనులు వేగవంతం చేయాలని రూరల్ ఎంపీడీఓ ఏవీ రమణ సూచించారు. గురువారం రూరల్ మండలం దొండపాడు గ్రామంలోని గుమ్మడితోట జగనన్న హౌసింగ్ లే- అవుట్‌లో జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ డి.పృథ్వీ, సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను సత్వరమే పూర్తి చేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని పెదపాలపర్రు, గురజ, కొరగుంటపాలెం జగనన్న కాలనీల్లో గురువారం పర్యటించి ఇళ్ల నిర్మాణాలను వారు పరిశీలించారు. కాలనీల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. వీరి వెంట వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు ఉన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి



అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌ఐ లక్ష్మీనరసింహం

గుడివాడటౌన్: మాదక ద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్‌ఐ లక్ష్మీనరసింహం అన్నారు. స్థానిక న్యూవిజన్ కాలేజీ విద్యార్థులకు మాదక ద్రవ్యాలు-అవగాహన, మోటారు వాహనాలు, హెల్మెట్, లైసెన్స్ తదితర అంశాలపై గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ జాషువా, డీఎస్పీ ఎన్ సత్యానందం, రూరల్ సీఐ జయకుమార్ ఆదేశాల మేరకు విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం జరుగకుండా విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో కళలను కాపాడాలి



పోసాని కృష్ణమురళీని సన్మానిస్తున్న కళాపరిషత్ సభ్యులు

పామర్రు: గ్రామీణ ప్రాంతాల్లో కళలను కాపాడవలసిన బాధ్యత కళాభిమానులపై ఉందని, వారికి ఏపీ ప్రభుత్వ నాటక టీవీ సినిమా అభివృద్ధి సంస్థ ఎప్పుడూ సహకారం అందిస్తోందని ఏపీ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నటుడు నిర్మాత, దర్శకుడు పోసాని కృష్ణమురళి అన్నారని పామర్రు కళా పరిషత్ గౌరవ అధ్యక్షుడు పీఎంఎస్ ప్రసాద్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మనుష్యుల మధ్యన మైత్రి భావాన్ని కళలు పెంపొందిస్తాయన్నారు. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపికైన పోసాని కృష్ణమురళీని విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిసి కళా పరిషత్ తరఫున సన్మానించి, అభినందనలు తెలిపామన్నారు. కళా పరిషత్ ద్వారా నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారని చెప్పారు. కళా పరిషత్ వారి ఆహ్వానం మేరకు ఎనీఆర్ స్వగ్రామం నిమ్మకూరు, పామర్రు కూచిపూడి గ్రామాల్లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటానని పోసాని చెప్పారన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నూతలపాటి త్రివిక్రమరావు, డైరెక్టర్ మరీదు హరిబాబు పాల్గొన్నారు.

ఈ - క్రాప్ నమోదుపై అవగాహన

గుడివాడటౌన్(నందివాడ): ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-క్రాప్ విధానాన్ని రైతులకు వివరించి అవగాహన పెంచాలని అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ(ఆత్మ) అదనపు సంచాలకులు డి.ప్రమీల అన్నారు. నందివాడ మండలంలోని చినలింగాల, పెదలింగాల, చేదుర్తిపాడు, ఒద్దులమెరక, పుట్టగుంట, జనార్ధనపురం, కుదరవల్లి గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలను ఆమె పరిశీలించారు. ఈ-క్రాప్ నమోదు వివరాలు ప్రత్యక్షంగా పరిశీలించారు. వ్యవసాయ క్షేత్రాల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పంట సరైనదో లేదో పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ-క్రాప్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా నమోదు కావలసిందేనన్నారు. అనంతరం మినుము పంటలో ఆశించే బూడిద తెగులు, సీతాఫలం తెగులు, పల్లాకు తెగులు, తెల్లదోమ, తామరపురుగుల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను ఆమె రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏడీ రమాదేవి, వ్యవసాయ అధికారి ఎం.శ్రీధర్, వీఆర్వోలు, వ్యవసాయ సహాయకులు, గ్రామ సర్వేయర్‌లు, రైతులు పాల్గొన్నారు.

జేఈఈ ర్యాంకర్‌కు సత్కారం



రంజిత్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్ తదితరులు

పామర్రు: జేఈఈ మెయిన్స్-2023లో ఉత్తమ ప్రతిభ కనబర్చి 99.70 పర్సంటేజ్ మార్కులను సాధించిన కొల్లి రంజిత్‌రెడ్డిని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రంజిత్‌రెడ్డిని గురువారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. పామర్రు గ్రామానికి చెందిన గుడివాడ సివిల్ కోర్టు ప్రభుత్వ లాయర్ కొల్లి వెంకట్రామకృష్ణారెడ్డి, సుజాత దంపతుల కుమారుడు రంజిత్‌రెడ్డి విజయవాడలో ఇంటర్ చదువుతూ జేఈఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. భవిష్యత్‌లో ఎన్‌ఐటీలో ఉచిత సీటు సాధించి గ్రామానికి, మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అభినందనలు తెలిపిన వారిలో పామర్రు వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి, ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ వై.రామకృష్ణ, ఎంఈఓ పి.విజయలక్ష్మి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి

కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్



ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కైకలూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. సర్పంచ్ దుట్టా మణి, ఎంపీటీసీ సభ్యుడు సాధు కొండయ్య ఆధ్వర్యంలో పల్లెవాడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం జరిగింది. మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన ప్రజలకు కరపత్రాలను ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. గ్రామంలో దళితవాడ, ఇందిరమ్మ కాలనీల్లో కార్యక్రమం జరిగింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు.

రూ.20 లక్షల కేటాయింపు..

గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు అత్యధికశాతం ప్రజలు తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని ఆకాంక్షిస్తున్నారని ఎమ్మెల్యే డీఎన్నార్ చెప్పారు. నియోజకవర్గం నాలుగు మండలాల్లో వయసుతో సంబంధం లేకుండా అనేక మంది 20 ఏళ్లు పాటి సీఎంగా జగన్ కొనసాగాలని కోరుతున్నారన్నారు. పల్లెవాడ గ్రామంలో తక్షణ పనుల నిమిత్తం రూ.20 లక్షలు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నిధులతో అత్యవసర పనులు చేసుకోవాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మరింత పురోభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో కైకలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, పీఏసీఎస్ అధ్యక్షుడు గంగుల అశోక్, ఉపసర్పంచ్ తోట జగన్‌మోహనరావు, మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, నాయకులు దుట్టా మోహన్, మత్తి బసవశంకరరావు, భాష్యం కిషోర్, బండ్రెడ్డి కుటుంబరావు, పాట్రిక్‌పాల్, బొబ్బిలి రత్తయ్యనాయుడు, దూసనపూడి నాంచారయ్య, చింతల జేమ్స్, దండే రవిప్రకాష్, కూనవరపు సతీష్, మదన్, భాష్యం నాగమణి, ఎంపీడీవో రామలింగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

దాతల సహకారం స్ఫూర్తిదాయకం



పాఠశాలకు వంటపాత్రలు అందజేస్తున్న జెడ్పీటీసీ వెంకట రమణకుమారి తదితరులు

పామర్రు(పమిడిముక్కల): ప్రభుత్వ పాఠశాలలకు దాతలు అందిస్తున్న సహకారం స్ఫూర్తిదాయకమని జెడ్పీటీసీ యేనుగ వెంకట రమణకుమారి అన్నారు. పమిడిముక్కల మండలం మేడూరు గ్రామంలో వైవీ ఆర్‌ఎం పదోన్నత పాఠశాలలో దాత సహకారంతో వంట సామగ్రిని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో పాఠశాల తనిఖీ చేయగా వంట సామగ్రి కొరత ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు విజ్ఞప్తి మేరకు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఎన్ఆర్ఐ వింగ్ కూచిభట్ల కిరణ్‌కుమార్ కుమార్తె లక్ష్మీతాన్య జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలకు రూ.25 వేలు విలువ చేసే మధ్యాహ్న భోజన పథక నిర్వహణ సామగ్రిని పాఠశాలకు బహూకరించారన్నారు. దాతలు ఇస్తున్న సహకారాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని విశ్వ దాతలుగా మారాలన్నారు. ప్రతీ ఒక్కరూ సాటి మనిషికి సహాయ పడేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గోర్కిపూడి మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు, కొనతం శివరామకృష్ణ, పాఠశాల హెచ్‌ఎం రోజా మేరి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోప్ స్కిప్పింగ్ క్రీడాకారుడికి అభినందన



దుర్గా వీర ప్రవీణ్, పీడీ మురళీలను అభినందిస్తున్న హెచ్‌ఎం శారదకాంత, జెడ్పీటీసీ రమణకుమారి

పామర్రు(పమిడిముక్కల): పమిడిముక్కల మండలం తాడంకి జెడ్పీ హైస్కూల్ విద్యార్థికి రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్‌లో తృతీయ బహుమతి సాధించారని హైస్కూల్ హెచ్‌ఎం ఎం.శారదకాంత తెలిపారు. తాడంకి హైస్కూల్‌లో విజేతను, పీడీని గురువారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. గత నెల 29, 30 తేదీల్లో భీమవరంలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థి పిడింట్ల దుర్గా వీర ప్రవీణ్ ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా విజేత అయిన విద్యార్థిని శిక్షణ ఇచ్చిన పీడీ జి.మురళీలను హెచ్‌ఎం, జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకట రమణకుమారి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కంభపు రాంబాబు అభినందించారు. కార్యక్రమంలో నాయకుడు మస్తాన్‌రావు, ఉపాధ్యాయులు సీహెచ్ రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి సాయం



పెదమద్దాలి(పామర్రు): పీఏసీఎస్ సంఘ సభ్యులకు సంఘం సహాయ సహకారాలను అందజేస్తోందని పెదమద్దాలి పీఏసీఎస్ అధ్యక్షురాలు సుంకర శిరీష తెలిపారు. పీఏసీఎస్ సంఘ పరిధిలోని కురుమద్దాలి గ్రామానికి చెందిన మృతురాలు విజయదుర్గ(58) కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంఘ సభ్యురాలైన విజయదుర్గ మృతి చెందటంతో పీఏసీఎస్ తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయం మృతురాలి భర్త పుట్టగుంట హనుమంతరావుకు అందజేశామన్నారు. కేడీసీసీ బ్యాంక్ సూపర్‌వైజర్ డీవీవీ పరశురామయ్య, పీఏసీఎస్ సీఈఓ తోలేటి రవి సత్యప్రసాద్, సంఘ డైరెక్టర్లు కొలుసు నరేంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు..

గుడ్లవల్లేరు: విన్నకోటలో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇళ్లు కాలిపోయిన అంకాలు, రామయ్య, తులసి కుటుంబాలకు రెడ్‌క్రాస్ వారు గురువారం చేయూతను అందించారు. బాధితులకు టార్పాలిన్లు, వంట సామాన్లు, నిత్యావసర వస్తులను అందజేశారు. రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి బి.శంకర్‌నాథ్, కోశాధికారి కొండపల్లి రామ్ బాలాజీ, తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ మస్తాన్, షకీలా బేగం పాల్గొన్నారు.

ఏపీవై పథకంతో ప్రయోజనాలు

మండవల్లి: పేదలకు అటల్ పెన్షన్ యోజన పథకంతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని స్థానిక ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడులో గురువారం పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు వయస్సు పైబడిన సమయంలో ఆదాయ భద్రత కల్పించేందుకు అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి ఎల్ఎస్ భాస్కరరావు, బ్యాంకు మిత్ర ఝాన్సీ, కె.అమర్‌నాథ్, డాని, సంసోను, జి.ఏసుదాసు పాల్గొన్నారు.

కేడీసీసీబీ రుణ పథకాలపై కళాజాతా

గుడ్లవల్లేరు: వడ్లమన్నాడు పీఏసీఎస్ వద్ద కేడీసీసీ బ్యాంక్ రుణ పథకాలపై కళాజాతా కార్యక్రమాన్ని గురువారం బిళ్లపాడు కళాభారతి డప్పు కళాకారులు నిర్వహించారు. కేడీసీసీ ద్వారా వచ్చే వ్యవసాయ రుణాలు, పీఎం జీవనజ్యోతి బీమా, సురక్ష బీమా యోజన, నగదు రహిత లావాదేవీలు, సైబర్ నేరాలతో పాటు వివిధ రంగాలకు అందిస్తున్న రుణ సదుపాయాలపై కళాజాతాలో రైతులు, ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కేడీసీసీ గుడ్లవల్లేరు బ్రాంచి మేనేజర్ మల్లీశ్వరి, సూపర్‌వైజర్ శ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు శేషం గోపి, సెక్రటరీ పి.సాయి లీలాచంద్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు

ముదినేపల్లిరూరల్: స్థానిక బీసీ బాలుర హాస్టల్‌లో వైద్య విద్యార్థిని అందించిన ఆర్థిక సహకారంతో మరుగుదొడ్ల మరమ్మతులు నిర్వహించారు. స్థానిక వైద్యుడు అంబుల మనోజ్ కుమార్తె వైష్ణవి వైద్య విద్యను అభ్యసిస్తోంది. బీసీ బాలుర హాస్టల్‌లో మరుగుదొడ్ల తలుపులు పాడైపోయాయి. అలాగే ఇతర మరమ్మతులు చేయించాల్సి ఉండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సమస్యలను తెలుసుకున్న వైష్ణవి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించడంతో మరమ్మతులు పూర్తి చేశారు. వైష్ణవితో పాటు సయ్యద్ జిలానీ అనే వ్యక్తి మరో రూ.5 వేలు విరాళంగా అందించడంతో 12 మరుగుదొడ్లు మరమ్మతులు చేపట్టారు. సందర్భంగా వైష్ణవిని పలువురు అభినందించారు.